క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కావలి: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. 99592 25643 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

రేపు ఆత్మకూరు డిపోలో..

ఆత్మకూరురూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యు వర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నీసా బుధవారం తెలిపారు. 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఉదయగిరి నూతన ఎస్సైగా కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తోటపల్లిగూడూరు ఎస్సైగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

దుత్తలూరు: మండల నూతన ఎస్సైగా నక్కా ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయగిరి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా దుత్తలూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు పెద్దపీట వేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

3, 4న రాజకీయ శిక్షణ తరగతులు

ఉదయగిరి: సీపీఎం సభ్యులకు జూన్ 3,4 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఫరిద్దీన్‌బాషా బుధవారం తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగే శిక్షణ తరగతుల్లో కే అజయ్‌కుమార్, రమేష్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొని శిక్షణ ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

151.8 మి.మీ వర్షపాతం నమోదు

ఆత్మకూరు: గడిచిన 24 గంటల్లో బుధవారం ఉదయానికి ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో 151.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. మర్రిపాడులో 42.4, ఉదయగిరిలో 31, చేజర్లలో 30, అనంతసాగరంలో 37.6, కలువాయిలో 7.8, ఆత్మకూరులో 2.2, ఏఎస్‌పేటలో 0.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

కలిగిరిలో 504 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 504 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 612 బేళ్లను వేలానికి తీసుకురాగా, 504 బేళ్లను కొనుగోలు చేశారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.150, సగటున రూ. 198.74 ధర లభించిందని తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

కలిగిరి: చిన్నఅన్నలూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలను గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురు, శుక్రవారాల్లో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం నూతన విగ్రహాల ప్రతిష్ట, సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉదయగిరి: పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంకు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. పుల్లాయపల్లెకు చెందిన ప్రసాద్ మోటార్‌సైకిల్‌పై గండిపాళెం రోడ్డు మార్గం వైపు వెళ్తూ, అదే మార్గంలో నడిచి వెళ్తున్న నరసింహులు అనే వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గమనించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఇందుపూరు ఏఎన్ఎం మృతి

అల్లూరు: మండలంలోని ఇందుపూరు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆర్ వెంకట భవాని(38) బుధవారం మృతి చెందింది. విడవలూరు మండలం ముదివర్తికి చెందిన వెంకట భవాని గర్భిణి . నెలరోజులుగా సెలవుపై ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం ఆమె ప్రమాదవశాత్తు ఇంట్లో బాత్‌రూమ్‌లో జారిపడడంతో తీవ్రరక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివాహమైన చాలా సంవత్సరాల తరువాత గర్భందాల్చడం అంతలోనే మృతి చెందడంతో ఆమె కుటుంబంలో విషాదం అలుముకుంది.

జగనన్న చెప్పింది చేస్తారు



మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం తాను చేయగలిగిందే చెబుతారని, చెప్పింది చేస్తారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం రేవూరు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం రూ.33 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన వాటితో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చారని తెలిపారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిపక్ష నాయకులు తాము కూడా చేస్తామని పరోక్షంగా ఫుల్‌మార్కులు వేశారన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దానికి పోటీగా టీడీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించి విఫలమైందని విమర్శించారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దివాళా తీస్తుందని విమర్శలు చేసిన చంద్రబాబు టీడీపీ మహానాడులో జగనన్న సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ ప్రకటించిన పథకాలను చూస్తే పరోక్షంగా జగనన్న పాలనను సమర్థిస్తున్నారని అర్థం అవుతుందన్నారు. 2014 ఎన్నికల సమయంలో రైతులు, పొదుపు మహిళలకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ మేరకు రుణాలను మాఫీ చేశారో ప్రతిఒక్కరికీ తెలుసునన్నారు. చంద్రబాబును నమ్మి పొదుపు మహిళలు తీసుకొన్న రుణాలను చెల్లించక అప్పుల పాలవగా, జగనన్న అధికారంలోకి వచ్చాక నగదును చెల్లిస్తూ ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఏ సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, రేవూరు సర్పంచ్ ఆత్మకూరు బజ్జమ్మ, ఉపసర్పంచ్ పీ నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, బొమ్మవరం సర్పంచ్ కే లక్ష్మీదేవి, నాయకులు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు బత్రెడ్డి నాగేంద్ర, చెంచురత్నం, తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఆత్మారాముడు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో కొలువైన ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సీతా, లక్ష్మణ సమేతుడైన ఆత్మారామస్వామి ఉత్సవమూర్తులను శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.



శేషవాహనంపై ఆత్మారామస్వామి

కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దువ్వూరులోని గంగా, పార్వతి సమేత కోటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు శివకుమార్‌స్వామి అంకురార్పణ పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



ఆత్మకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



వరికుంటపాడులో.



కొండాపురంలో..

ఆత్మకూరు: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని ఆత్మకూరు సీహెచ్‌సీ డాక్టర్ ఎస్కే అస్మా, మహిమలూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని హెల్త్ కేంద్రం నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు వైద్యఆరోగ్య సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎస్ సుధాకర్, సీహెచ్ మల్లెంకొండయ్య, శైలజ, రషీద్, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రతిమ పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలను వివరించారు.

చేజర్ల: స్థానిక పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ చంద్రయ్య పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలను వివరించారు.


ఉదయగిరి: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని ఎంపీడీఓ బిజాక్‌ప్రవీణ్ పేర్కొన్నారు. పట్టణంలోని బిట్-3 సచివాలయంలో ఫర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫర్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఆయేషా, కరీష్మా ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం: స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నస్రుద్దీన్ పాల్గొన్నారు.



సంగంలో..



చేజర్లలో..

రేపటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

అనుమసముద్రంపేట: రాజవోలు సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జూన్ 2, 3 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2న సాయంత్రం 4.30 గంటల నుంచి దూబగుంటలో, 3న సాయంత్రం 4.30 గంటల నుంచి పానుగోడు, రాజవోలు గ్రామా ల్లో పర్యటిస్తారని వివరించారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

ఆశీర్వాదం

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): పల్లిపాడులో బుధవారం జరిగిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొప్పల రఘు మేనకోడలు వాణి వివాహానికి ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రహీంకు నివాళి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్ కలాం సోదరుడు రహీం (62) బుధవారం మృతి చెందారు. రహీం మృతదేహాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. రహీం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సీతారామపురం: మండలంలోని పంద్రంగి, నారాయణంపేట గ్రామాల సమీపంలో ఉన్న పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కలశస్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కలప వేలం

కలిగిరి: వెలగపాడు చెరువులోని నల్లతుమ్మ చెట్లను కావలి డీఎల్‌పీఓ కే రాధామాధవిలత ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం వేశారు. వెలగపాడులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన బహిరంగ వేలంలో చెరువులోని 5525 నల్లతుమ్మ చెట్లను వెలగపాడుకు చెందిన ఎస్వీ రామకృష్ణ రూ.10.50 లక్షలకు దక్కించుకున్నాడు. ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్ రావు, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, పంచాయతీ కార్యదర్శి తనూజ, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ రమణయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హెచ్ఎస్ అన్నపూర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేందుకు అర్హులైన వారు జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆటో బోల్తా-డ్రైవర్‌కు గాయాలు

వరికుంటపాడు: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన విరువూరు సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన కలాం తన ఆటోలో ప్రయాణికులను తీసుకుని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి వచ్చాడు. ప్రయాణికులను దించి తిరిగి పామూరు వెళ్తుండగా విరువూరు సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో కలాం తలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పామూరు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

16 నుంచి మానసాదేవి బ్రహ్మోత్సవాలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 16 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆ ఆలయ చైర్మన్ చల్లా తిరుపతయ్య తెలిపారు. మానసాదేవి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. వైస్ చైర్మన్ నాయుడు,అర్చకులు ప్రవీణ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీపై పరిశీలన

జలదంకి: రామవరప్పాడుకు చెందిన వర్ధినేని హరిత తన పొలం అన్యాక్రాంతమైందని, తనకు హద్దులు చూపి న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. సర్వే నంబర్ 743-1లో 2.93 ఎకరాలు ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదై ఉండగా, ప్రస్తుతం సాగులో 2.33 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన 0.60 సెంట్లను తనకు చూపాలని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కావలి ఆర్డీఓ శీనానాయక్ రామవరప్పాడులో బుధవారం పర్యటించి పొలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల రైతులకు నోటీసులు ఇచ్చి రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేసి పొలానికి హద్దులు చూపుతామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, సర్వేయర్ బాషా, వీఆర్వో చెన్నకృష్ణయ్య ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా బుధవారం నూతన ప్రతిష్ట, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

ఇసుక టిప్పర్ బోల్తా

కొండాపురం: పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్ నేకునాంపేట-తూర్పుపాళెం గ్రామాల మధ్యనున్న మలుపులో బుధవారం అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. టిప్పర్ బోల్తాపడిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. డ్రైవర్ పరారీలో ఉండడంతో వాహనానికి సంబంధించిన వివరాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

లైఫ్‌పై అవగాహన ర్యాలీ

సంగం: ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ సెంటర్‌లోని ఆటో స్టాండ్‌కు చెందిన ఆటో డ్రైవర్లకు లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్(లైఫ్)పై బుధవారం అవగాహన కల్పించారు. వాహన కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం ఆటోడ్రైవర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దేవాలయాల అభివృద్ధికి సీఎం సహకారం



ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి కాకాణి



నూతన దేవతామూర్తుల విగ్రహాలు

చేజర్ల(సోమశిల): రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో బుధవారం మంత్రి పాల్గొన్నారు. తొలుత మంత్రికి వేదపండితులు సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడు తూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాలను నిర్మించాలని సీఎం వైఎస్ జగన్ సంకల్పించారన్నారు. టీటీడీ సహకారంతో ఆలయాల నిర్మాణానికి రూ.10 లక్షలు అందజేస్తున్నారని తెలిపారు. దాతల దాతృత్వంతో ఉప్పలపాడులో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించడం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించిన గ్రామస్తులు, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ఆ భగవంతుడి కృపాకటాక్షాలు ఉండాలని కోరారు. అనంతరం నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రముఖ కాంట్రాక్టర్ ఊరుబిండి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

దగదర్తి (కావలి): వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వెలుపోడు సచివాలయం పరిధిలోని వలంటీర్లను బుధవారం ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. వలంటీర్లను శాలువాలతో సత్కరించి పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వలంటీర్లు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మేకపాటిని కలిసిన నాయకులు



మాజీ ఎంపీ మేకపాటిని సన్మానిస్తున్న ఉదయగిరి నాయకులు

ఉదయగిరి: మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఉదయగిరికి చెందిన పలువురు నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి మేకపాటి కుటుంబానికి ఎంతో అవినాభావ సంబంధం ఉందని, ఉదయగిరి అభివృద్ధికి తామెంతో తోడ్పాటు అందించామన్నారు. ఉదయగిరి ప్రజలకు మేకపాటి కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని మండలాల నేతలను సమన్వయం చేసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తామన్నారు. మేకపాటిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాజుల తాజుద్దీన్, లెక్కల మాలకొండారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు బాబు, జూపల్లి రాజారావు, మూలె వీరారెడ్డి, ఆంధ్రా బాలగురవారెడ్డి, గోగుల వెంగళరెడ్డి, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి, మొక్క శ్రీనివాసులురెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు. అనంతరం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

జంగాలదొరువులో చోరీ

- ఆరు సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

సంగం : ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఆరు సవర్ల బంగారాన్ని అపహరించుకెళ్లారు. ఈ ఘటన జంగాలదొరువులో బుధవారం వెలుగు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన లాలం చినకొండయ్య, కనకమ్మ దంపతులు మే 12న ఏఎస్‌పేట మండలం అబ్బాసాహెబ్‌పేటలో పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. అప్పట్నుంచి అక్కడే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కనకమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బుధవారం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి డ్రెస్సింగ్ టేబుల్లో చూడగా ఆరు సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జునరెడ్డి చోరీ జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానాన్ని కొనసాగిస్తాం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు అన్నదానాన్ని జీవిత కాలం కొనసాగిస్తామని సాంబశివ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆస్పత్రిలో అన్నదానాన్ని ప్రారంభించి రెండు నెలలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు ఆస్పత్రిలో ఆత్మకూరుతో పాటు ఉదయగిరి, వైఎస్సార్ జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల,తదితర ప్రాంతాలకు చెందిన వారు వైద్యసేవలు పొందుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో తన సొంత ఊరికి ఏదైనా సేవ చేయాలనే ఆలోచనతో ఆస్పత్రిలో అన్నప్రసాద వితరణ చేపడుతున్నామన్నారు. ఇందుకు సేవా భావంతో సహకారం అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత హెచ్ఎంలు కేవీ శేషారెడ్డి, నారాయణరావు, విశ్రాంత గ్రంథాలయాధికారి గోవిందరెడ్డి, రాంపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై రూ.5.72 లక్షల జరిమానా

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి రిజర్వు ఫారెస్ట్ నుంచి తెల్లరాయి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు జిల్లా అటవీ శాఖాధికారి ఏ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు రూ.5,72,176 జరిమానా విధించినట్లు రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 30న గువ్వాడి రిజర్వు ఫారెస్ట్ నుంచి తెల్లరాయిని అక్రమంగా తవ్వి తరలిస్తుండగా ప్రొక్లయినర్‌తో పాటు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అటవీ భూముల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

4వ, 5వ తరగతి విద్యార్థులకు
నవోదయ, గురుకుల, సైనిక స్కూలు,
తేది 01-06-2023 నుండి నూతన భవనంలో కోచింగ్ ప్రారంభమగును.
96522 18908
74169 44669
స్థాపితం : 2002
నవోదయ మార్గదర్శి కోచింగ్ సెంటర్
RTC డిపో ఎదురుగా, ఆత్మకూరు.



మా అభివృద్ధికి మార్గదర్శి
మానవతా విలువలు గలిగిన మహోన్నత వ్యక్తి
కీ॥శే॥ బొల్లినేని రమణయ్య గారు
ఆ మహనీయుని 31వ వర్ధంతి
సందర్భంగా హృదయపూర్వకంగా స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.
తేది : 1-6-2023 గురువారం, మాముడూరు గ్రామంలో

కుమారులు
బొల్లినేని క్రిష్ణయ్య, ME., ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే
బొల్లినేని శీనయ్య, MSc.,Ag.
బొల్లినేని భాస్కరరావు, M.S.,DNB., CT Surgeon

కోడళ్ళు
సుజాత
యమున
రాజశ్రీ

కుమార్తెలు
తాళ్లూరు లలితమ్మ
చప్పిడి పద్మమ్మ

అల్లుళ్ళు
పెంచలనాయుడు
డా॥ జనార్ధననాయుడు

మనుమలు
అర్జున్
సందీప్ - హారిక
రమణదీప్, ప్రద (మునిమనుమడు, మునిమనుమరాలు)
డా॥ అభినయ్ - డా॥ శ్వేత, దేవ్ (మునిమనుమడు)
అద్విక్ - మణిదీపిక, శ్రీసిఖ (మునిమనుమరాలు)

మనుమరాళ్ళు
ఐశ్వర్య - వెంకట్ రామ్ చౌదరి
అద్య, అర్పిత (మునిమనుమరాళ్ళు)
డా॥ హారిణి - డా॥ అశోక్
మేఘవంచిత్ (మునిమనుమడు)
గిరి - శివమాల
శశాంక్, రోహన్ (మునిమనుమలు)
సురేష్ - పద్మజ
సంహిత, శ్రీరిషి (మునిమనుమలు)
రాయ జ్యోతి-బాలాజి
అవినాష్, శౌర్య (మునిమనుమలు)